# స్థానిక పెట్టుబడిదారులకే తొలి ప్రాధాన్యత

- మౌలిక సదుపాయాల కల్పనపై కీలక దృష్టి
- సర్కారు పాలసీ, నిర్మాణరంగం గ్రోత్ ఇంజన్లు
- రాజకీయ నేతల అపోహలతో నష్టపోవద్దు
- షామీర్‌పేట్, మేడ్చల్ వరకు మెట్రో విస్తరణ
- క్రెడాయ్ ప్రాపర్టీ షోలో సిఎం రేవంత్‌రెడ్డి



'క్రెడాయ్' ప్రాపర్టీ షోని ప్రారంభిస్తున్న రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న సిఎం

**ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో**

విద్యుత్, నీటి వసతి, రవాణా వంటి మౌలిక సదుపాయాలు బాగుంటేనే పెట్టుబడులు విరివిగా వస్తాయనీ, అందుకే తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పనపై తమ ప్రభుత్వం కీలక దృష్టి సారించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. రాజకీయ నేతల అపోహలను నమ్మొద్దనీ, వాటికి ఊతమిచ్చి నష్టపోవద్దని క్రెడాయ్ ప్రతినిధులకు సూచించారు. విదేశాలకెళ్లి మరీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నోళ్లం.. ఇక్కడే పుట్టి.. ఇక్కడి నేలపైనే పెట్టుబడి పెడుతున్నవారిని ఎలా విస్మరిస్తామని అన్నారు. స్థానిక పెట్టుబడిదారులకే తొలి ప్రాధాన్యమిస్తామని భరోసానిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 'క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షోను సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపోహలు సృష్టించి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నవారికి కనువిప్పు కలిగేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన క్రెడాయ్ ప్రతినిధులను అభినందించారు.

ప్రభుత్వ పాలసీ, నిర్మాణ రంగం రెండూ రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజన్స్ లాంటివన్నారు. నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలున్నా పాలసీపరమైన పెరాలసిస్ లేకుండా చూడడం వల్లే ప్రపంచంతో హైదరాబాద్ నగరం పోటీపడుతోందని చెప్పారు. తెలంగాణలో పెట్టుబడులకు రక్షణ కల్పించడమే కాదు.. లాభాలు వచ్చేలా ప్రోత్సహించే బాధ్యత కూడా తమ ప్రభుత్వంపై ఉందన్నారు. సగటు మధ్యతరగతి ఆలోచనలున్న సిఎంనని, సమాజ శ్రేయస్సు కోసమే ఎక్కువ ఆలోచిస్తానని స్పష్టం చేశారు. పెట్టుబడిదారులు అడిగిన అన్నింటికీ అంగీకరించకపోవచ్చు, సహకరించకపోవచ్చుగానీ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధికి ఎల్లప్పుడు అండగా ఉంటానని భరోసానిచ్చారు.

**జైపాల్ రెడ్డితోనే మెట్రో సాకారం**

అప్పటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి చొరవతో తెలంగాణకు మెట్రో వచ్చిందని, కానీ, గత పాలకుల నిర్లక్ష్యంతో పదేళ్లలో విస్తరణ జరగలేదని సిఎం వాపోయారు. మెట్రో విస్తరణ జరిగి ఉంటే హైదరాబాద్‌లో కొంత మేరకైనా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించేదని అభిప్రాయపడ్డారు. జనసాంద్రత ఎక్కువున్న నగరాల్లో మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్ పెరగాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. షామీర్‌పేట్, మేడ్చల్ వరకు మెట్రో విస్తరణకు కృషి చేస్తున్నామని తెలిపారు. మహానగరం ప్రతిష్టపెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నొక్కి చెప్పారు.

**కేంద్రం అనుమతులు తెచ్చుకోవడం కూడా తప్పేనా?**

తాను మాటమాటకీ ఢిల్లీ వెళ్తున్నానని టార్గెట్ చేసి కొందరు మాట్లాడటాన్ని సిఎం రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. మెట్రో, మూసీ, తదితర అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి అవసరం లేదా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ఉంటే అక్కడకు కాకుండా ఇంకెక్కడికి వెళ్తారని నిలదీశారు. ఢిల్లీలో సిఎంకు బంగళా ఇచ్చింది నెలకు నాలుగు రోజులు అక్కడకెళ్లి కేంద్రంతో కొట్లాడి అనుమతులు తెచ్చుకోవడానికేననీ, ఆ బంగళాను ఫామ్‌హౌస్‌లా వాడుకుని దావత్‌లు చేసుకోవడానికి కాదని స్పష్టం చేశారు. చాలా రాష్ట్రాల్లో ఐదారు ఎయిర్‌పోర్టులున్నాయనీ, తెలంగాణలో ఒక్క ఎయిర్‌పోర్టు ఉంటే సరిపోతుందా? మిగతా నగరాలకు అవసరం లేదా? తెలంగాణకు మరిన్ని విమానాశ్రయాలు తెచ్చుకోవద్దా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మెట్రో, ఎయిర్‌పోర్టులు, రీజనల్ రింగ్‌రోడ్డు, రీజనల్ రింగ్ రైల్‌లైన్ అనుమతులు అడగటం రాష్ట్ర ప్రయోజనాల కోసమే కదా అని ప్రశ్నించారు. రీజనల్ రింగ్ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డుకు 11 కొత్త రేడియల్ రోడ్లు ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. హైదరాబాద్ అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవేలో డ్రై పోర్టు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా త్వరలోనే అనుమతులు రాబోతున్నాయని చెప్పారు.

**నీళ్లుండే చోటుకు మనమెళ్తే నీళ్లెక్కడికి వెళ్తాయ్?**

నీళ్లుండే చోటును మనమెళ్లి ఆక్రమిస్తే మరి నీళ్లు ఎక్కడకు పోతాయని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకే హైడ్రాతో చెరువులను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ నగర తాగునీటి అవసరాల కోసం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. భూమి ఒక సెంటిమెంట్ అనీ, ఆ సెంటిమెంట్‌ను ఎంత పాజిటివ్‌గా ముందుకు తీసుకెళ్తారనేదని పైనే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆధారపడి ఉంటుందని క్రెడాయ్ ప్రతినిధులకు సూచించారు.

**గ్లోబల్ సిటీగా హైదరాబాద్ : ఎన్.జయదీప్‌రెడ్డి**

హైదరాబాద్ మహానగరం గ్లోబల్ సిటిగా వేగంగా ఎదుగుతున్నదని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు ఎన్.జయదీప్‌రెడ్డి చెప్పారు. "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 18 నెలల్లో ఎంతో అభివృద్ధి జరిగింది. కీలక ఎంట్రీ పాయింట్ల అభివృద్ధి, రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ జోన్ల ఏర్పాటు, క్రీడా విధానం రూపకల్పన, మౌలిక వసతుల విస్తరణ వంటి చర్యలు నగరాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తాయి" అని ఆశాభావం వ్యక్తం చేశారు.

**రూ.లక్ష కోట్ల విలువైన గృహాల విక్రయాలు : బి.జగన్నాథ్‌రావు**

"హైదరాబాద్ ఐటీ, మాన్యుఫాక్చరింగ్, ఫార్మా, ఈవీ, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తోంది. 2024లో లక్ష కోట్ల రూపాయల విలువైన గృహ విక్రయాలు జరిగాయి. వాణిజ్య రంగంలో అమెజాన్ అతిపెద్ద క్యాంపస్, గూగుల్ రెండో అతిపెద్ద క్యాంపస్ ఇక్కడే ఉన్నాయి. ప్రపంచంలోనే వేగంగా 100 మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్-ఎ కమర్షియల్ రియల్ ఎస్టేట్ కలిగిన నగరంగా హైదరాబాద్ నిలిచింది" అని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు- ఎలక్ట్ బి.జగన్నాథ్‌రావు తెలిపారు.

**హైడ్రాతో జలవనరుల రక్షణ : కె క్రాంతికిరణ్‌రెడ్డి**

"మన జల వనరులు ఆందోళనకరంగా తగ్గిపోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన హైడ్రా కార్యక్రమం భవిష్యత్ తరాల కోసం నీటిని సంరక్షించే విప్లవాత్మక పథకం. అలాగే ఈగల్ కార్యక్రమం మాదక ద్రవ్యాల నిర్మూలనలో కీలక పాత్ర పోషిస్తోంది. స్థిరమైన అభివృద్ధి కోసం నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, పర్యావరణహిత పద్ధతులు ప్రతి ప్రాజెక్టులో అమలు చేస్తామని హామీ ఇస్తున్నాం" అని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షులు కె.క్రాంతికిరణ్‌రెడ్డి తెలిపారు.

ఈ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో క్రెడాయ్ కన్వీనర్ కుర్రా శ్రీనాథ్, కో-కన్వీనర్ అరవింద్‌రావు మెచినేని, క్రెడాయ్ జాతీ అధ్యక్షులు-ఎలక్ట్ జి.రాంరెడ్డి, క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ అగర్వాల్, కె. అనిల్ రెడ్డి, వై.రవిప్రసాద్, ఖజాంచీ నితీష్ రెడ్డి గూడూర్, సంయుక్త కార్యదర్శులు సంజయ్ కుమార్ బన్సాల్, శ్రీరామ్ ముసునూరు తదితరులు పాల్గొన్నారు

## 3 రోజుల పాటు ప్రాపర్టీ షో

క్రెడాయ్ ప్రాపర్టీ షో ఆగస్టు 15, 16, 17 తేదిల్లో మూడు రోజుల పాటు కొనసాగనున్నది. ఈ ప్రదర్శనలో నగరవ్యాప్తంగా ఉన్న 70కి పైగా డెవలపర్లు తమ 300కు పైగా రెరా ఆమోదిత ప్రాజెక్టులను, అపార్ట్‌మెంట్ కాంప్లెక్సులు, విల్లాలు, ప్లాట్లు, కమర్షియల్ స్పేసులను ఒకే వేదికపై ప్రదర్శించారు. అగ్రశ్రేణి బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, సంబంధిత రంగాల ప్రతినిధులు తమ సేవలను, ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నారు. ఎంపిక మీది (ఛాయిస్ ఈజ్ యువర్స్) అనే థీమ్ గృహ కొనుగోలు దారులను ఆకర్షిస్తోంది.



మెడల్స్ అందుకుంటున్న ఖమ్మం సిపి సునీల్ ధత్, ఎస్‌పిఎఫ్ కమాండెట్ త్రినాథ్

## పోలీస్ మెడల్స్ ప్రదానం చేసిన సిఎం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

గోల్కొండ కోటలో గురువారం జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో పలువురు పోలీసు అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీస్ మెడల్స్ ప్రదానం చేశారు.జైళ్ల శాఖ డిజి సౌమ్యామిశ్ర, ఐపిఎస్ (1994), పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్, ఐపిఎస్ (1997), అడిషినల్ డిజి ఎస్‌కె జైన్, ఐపిఎస్ (1997), రిటైర్డ్ డిసిపి కటకం మురళీధర్‌లు సిఎం నుండి ప్రెసిడెంట్ మెడల్ అందుకున్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఐపిఎస్ (2014) గ్యాలెంట్రీ మెడల్ అందుకున్నారు. గ్రేహౌండ్స్ కమాండర్ ఎ.వెంకటేశ్వర్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండర్ నరుకుళ్ల త్రినాథ్, జాయింట్ సిపి పరిమళ హన నూతన్ లు మెడిటోరిస్ పోలీస్ మెడల్ సిఎం నుండి అందుకున్నారు. పోలీస్ అకాడమీ డిప్యూటి డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, పోలీసు అధికారులు డి.చంద్రయ్య, కె వీరయ్య, పి.నరేష్ రెడ్డి,ఏసుపాదం,జంగయ్య, తదితరులు మెడిటోరిస్ పోలీస్ మెడల్ అందుకున్నవారిలో ఉన్నారు.అవార్డు గ్రహీతలందరితో గ్రూప్ ఫొటో దిగిన సిఎం రేవంత్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజలకు సిఎం శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మానవ జీవితంలో గీత బోధనలు ఎంతో ప్రభావశీలమైనవని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మానవుడి ప్రతి దశలోనూ కృష్ణ భగవానుడు కొలువై ఉంటారని తెలిపారు. శ్రీమహావిష్ణువు దశావతారాలలో శ్రీకృష్ణావతారం చాలా ప్రత్యేకమైందని పేర్కొన్నారు. దుష్ట సంహారం కోసం మానవుడిగా జన్మించి మానవాళికి ఎంఒ అవసరమైన భగవద్గీతను ప్రబోధించారని వివరించారు. శ్రీకృష్ణతత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి పనిలో విజయం సాధించవచ్చని తెలిపారు. కృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని కోరారు.



## సర్కార్ దవాఖానాలో ఐఎఎస్ రాహుల్ సతీమణి ప్రసవం

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

ఐటిడిఎ పివో, యువ ఐఎఎస్ అధికారి బి.రాహుల్ అధికారులందరికీ ఆదర్శంగా నిలిచారు. తన భార్యకు ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేయించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం ఐటిడిఎ పిఒ రాహుల్ సతీమణి మనీషా రాహుల్ పురుడు పోసుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. గురువారం సాయంత్రం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు నార్మల్ డెలివరీ అవుతుందేమోనని వేచి చూశారు. కానీ కుదరకపోవడంతో శుక్రవారం తెల్లవారుజామున ఆపరేషన్ చేయగా 3.16 నిమిషాలకు పండంటి మగ బిడ్డ పుడ్డాడు. ఐఎఎస్ ఆఫీసర్ అయినప్పటికీ బి.రాహుల్ ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో తన సతీమణికి ప్రసవం జరిగేలా నిర్ణయం తీసుకున్నందుకు పలువురు అభినందించారు.

# డిజిపి జితేందర్‌కు మాతృవియోగం

- నేడు మహాప్రస్థానంలో అంత్యక్రియలు

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర డిజిపి జితేందర్‌కు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి కృష్ణ గోయెల్(86) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా ఆమె శుక్రవారం ఉదయం పరిస్థితి విషమించి తుది శ్వాస విడిచారని వైద్యులు తెలిపారు. ఆమెకు జితేందర్‌తో పాటు మరో కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లి అంతిమ శ్వాస విడిచిన సమయంలో డిజిపి జితేందర్ గోల్కొండ కోటలో జరుగుతున్న స్వాతంత్ర్య వేడుకల్లో నిమగ్నమై ఉన్నారు. తల్లి మరణవార్త తెలియగానే ఆయన కార్యక్రమం మధ్యలో నుంచే ఆస్పత్రికి హుటాహుటిన చేరుకున్నారు. ఆస్పత్రి నుంచి తల్లి మృతదేహాన్ని యూసఫ్‌గూడలోని తన నివాసానికి డిజిపి తీసుకెళ్లారు. ఆమె అంత్యక్రియలు శనివారం నానక్‌రాంగూడలోని మహాప్రస్థానంలో జరుగుతాయని అధికార వర్గాలు తెలిపాయి. డిజిపికి మాతృవియోగం పట్ల సీనియర్ ఐపిఎస్ అధికారులు పలువురు ఆయనకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



## దేశ ద్రోహులను ప్రధాని మోడీ స్మరించడం అన్యాయం

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ప్రసంగంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ త్యాగశీలులను విస్మరించి దేశద్రోహులను పొడగటం అన్యాయమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి దేశ స్వాతంత్ర్యానికి సంబంధం లేదనీ, అలాంటి వ్యక్తిని మోడీ ఎలా పొగుడుతారని ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయం వద్ద 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జాతీయ జెండాను ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించిన మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, అంబేద్కర్ లాంటి మహనీయుల గురించి గాని, వారి త్యాగాల గురించి గానీ ప్రధాని ఎక్కడా ప్రస్తావించలేదని విమర్శించారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ప్రస్తావన ముందుకు తీసుకొచ్చి స్వాతంత్ర్యోద్యమ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బ్రిటీష్‌వారితో జరిగిన సాత్వంత్ర్యపోరాటానికి శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఏనాడూ మద్దతివ్వలేదనీ, స్వాతంత్ర్యం అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ కోరిక మేరకు జనసంఘ్‌ను ప్రారంభించారని తెలిపారు. తెల్లదొరలకు సేవ చేసిన సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ అని విమర్శించారు. తాను జైలులో ఉండటం కంటే బయట ఉంటేనే మీకు ఎక్కువ ఉపయోగమని బ్రిటీషర్లతో బేరసారాలాడి జైలు నుంచి బయటకు వచ్చిన ద్రోహి సావర్కర్ అని అన్నారు. భారత ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు తలొగ్గి అమెరికాకు జూనియర్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం ముంచుకొస్తున్న నేపథ్యంలో కార్మికులు, కర్షకులు, ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర సీనియర్ నాయకులు పి. రాజారావు, కోశాధికారి వంగూరు రాములు, ఉపాధ్యక్షులు వీఎస్. రావు, రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్. ఎం పద్మశ్రీ, పి శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ సునీత తదితరులు పాల్గొన్నారు.

## 13 జిల్లా కోర్టులకు రూ.1053 కోట్లు మంజూరు

- మిగిలిన జిల్లాలకు రూ.891 కోట్లకు ప్రతిపాదనలు
- వెల్లడించిన హైకోర్టు సిజె జస్టిస్ ఎకె సింగ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని 13 జిల్లా కోర్టులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1,053 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని, మిగిలిన జిల్లాలకు రూ.891 కోట్లకు హైకోర్టు చేసిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎకె సింగ్ ప్రకటించారు. జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కోర్టు సముదాయాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,053 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేసిందన్నారు. మిగిలిన జిల్లాలకు రూ.891 కోట్లకు ప్రతిపాదనలకు ఆమోదం లభించాల్సి ఉందని తెలిపారు. హైకోర్టు, జిల్లా కోర్టుల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ప్రకటించారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైకోర్టు ఆవరణలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జస్టిస్ ఎకె సింగ్ ప్రసంగిస్తూ, ఎంతో మంది మహానుభావుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందని గుర్తుచేశారు. గత ఏడాదిలో 210 రోజులు కోర్టులు పని చేస్తే 74,768 కేసులు నమోదయ్యాయని, 72,414 కేసులు పరిష్కారం అయ్యాయని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పులు 3,500, హైకోర్టు తీర్పులు 2 వేలు తెలుగులోకి అనువాదం చేయించినట్టు తెలిపారు.

# ఒత్తిళ్లకు తలొగ్గం... బెదిరింపులకు భయపడం

- తెలంగాణ ప్రయోజనాలే లక్ష్యం
- బిసి రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి
- స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణ... 2047 నాటికి భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ కాబోతోందని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని చారిత్రక గోల్కొండ కోటలో శుక్రవారం జరిగిన వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సిఎం... పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. జై ఇండియా..జై తెలంగాణ అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి...2035 నాటికి ఒక ట్రిలియన్, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను మార్చే మహత్తర లక్ష్యంతో "తెలంగాణ రైజింగ్-2047" విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామనీ, వచ్చే డిసెంబర్ నాటికి ప్రజల ముందుకు రాబోతుందని వెల్లడించారు. మూసీ పునరుజ్జీవం నుంచి మొదలై గ్రామీణ తెలంగాణ వ్యవసాయ వికాసం వరకు ఈ విజన్‌ను రూపొందించామని తెలిపారు. "ప్రపంచ వేదికపై హైదరాబాద్‌ను బ్రాండింగ్ చేసేందుకు ఇటీవల 72వ ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించాం. దీంతో మన చారిత్రక కట్టడాలను, వారసత్వ సంపదను ప్రపంచ దేశాలకు చూపించే అవకాశం కలిగింది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ), గ్లోబల్ రైస్ సమ్మిట్, బయోఏషియా సదస్సు, భారత్ సమ్మిట్ తదితర వేదికలు తెలంగాణ విజన్‌ను ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేశాయి. బెంగుళూరు, ముంబాయి, చెన్నై లాంటి నగరాలు వరదలతో చిన్నాభిన్నం అవుతున్నాయి. హైదరాబాద్‌కు ఆ దుస్థితి రాకూడదని కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇప్పటి వరకు హైడ్రా 13 పార్కులు, 20 సరస్సులను అక్రమణల నుంచి రక్షించింది. రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడింది. స్వీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు దాన్ని రాజకీయం చేస్తున్నాయి. ప్రజల బాగోగుల గురించి పని చేస్తున్న హైడ్రాపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టండి" అని సిఎం ప్రజలకు పిలుపునిచ్చారు.

గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాలో ఒక్క నీటి చుక్కను కూడా వదులుకునే ప్రసక్తి లేదని ఈ సందర్భంగా రేవంత్ స్పష్టం చేశారు. నీటి వాటాల విషయంలో ఎవరి బెదిరింపులకు లొంగేది లేదని తేల్చి చెప్పారు. "కుల గణన ప్రామాణికంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం శాసనసభ ఆమోదించిన రెండు బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రిజర్వేషన్ల బిల్లులను పార్లమెంట్‌లో ఆమోదింప జెసి చట్ట రూపం ఇవ్వాలని గోల్కొండ కోటనుంచి కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాను. మేం చేసిన నిర్ణయాలు అత్యంత సాహసోపేతమైనవి. వాటిని అభినందించాల్సింది పోయి అడ్డుకోవడ సరికాదు" అని కేంద్రానికి హితవు పలికారు. అనంతరం పోలీసులతో పాటు వివిధ విభాగాల్లో అత్యున్నత ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితెందర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## పోరాట యోధుల స్ఫూర్తిని కొనసాగిద్దాం : ఐద్వా

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

స్వాతంత్ర్య పోరాట యోధుల స్ఫూర్తిని కొనసాగించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం 79వ పంద్రగస్టు వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని ఐద్వా రాష్ట్ర కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన సభలో లక్ష్మి మాట్లాడుతూ...నాడు కుల, మతాలకతీతంగా స్వాతంత్ర్యం కోసం పోరాడారని గుర్తు చేశారు. ఎందరో వీరుల త్యాగాలతో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నామని తెలిపారు. ఇన్నేండ్ల పరిపాలనలో మహిళల పరిస్థితి మెరుగుపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసమానతలు, వివక్ష కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. దాడులు, దౌర్జన్యాలు జరగుతూనే ఉన్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా, స్వాతంత్య పోరాట స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ఐక్యంగా నిలబడుదామని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కెఎన్ ఆశలత, ఉపాధ్యక్షురాలు శశికళ, రాష్ట్ర నాయకురాలు లక్ష్మమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్సు కంటైనర్ ఢీ

- 20 మందికి తీవ్ర గాయాలు
- ఎనిమిది మంది పరిస్థితి విషమం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

వరంగల్-ఖమ్మం (563) జాతీయ రహదారిపై ఆర్‌టిసి బస్సు- కంటైనర్ లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటన శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామ శివారులో జరిగింది. 20 మందికి గాయాలవ్వగా వారిలో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉంది. రాయపర్తి ఎస్ఐ ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు వరంగల్ నుంచి ఖమ్మం వెళ్తుండగా రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన కంటైనర్ లారీ వరంగల్ వైపు వస్తోంది. ఈ క్రమంలో రాయపర్తి మండలంలోని మైలారం గ్రామం శివారులో బస్సు, కంటైనర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సులో 44 మంది ప్రయాణికులుండగా ప్రమాదంలో 20 మందికి గాయాలయ్యాయి. అందులో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో జెసిబి సహాయంతో బయటికి తీశారు. క్షతగాత్రులను 108 వాహనంలో వరంగల్ ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే పాలకుర్తి నియోజకవర్గం ఎంఎల్ఎ యశస్వినిరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను దగ్గరుండి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

## కెఎల్‌హెచ్‌లో వేడుకగా స్వాతంత్ర్య దినోత్సవం

హైదరాబాద్ : కెఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్‌లో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. కెఎల్ డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయానికి చెందిన కెఎల్‌హెచ్ బాచుపల్లి, అజీజ్‌నగర్, కొండాపూర్, విజయవాడ క్యాంపస్‌ల్లో జాతీయ పతాకావిష్కరణ, గీతాలాపన, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళి, గౌరవ కవాతు, సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయని ఆ విద్యా సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. విద్యతో బాధ్యతను మేళవించి స్వావలంబన భారతాన్ని నిర్మించాలని ఆ యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవీష్ పేర్కొన్నారు.

## మేము చేసిన పోరాటాలను చెప్పుకోలేకపోయాం

- 'ప్రజా యోధుడు' పుస్తకావిష్కరణలో కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


శూన్యం నుంచి సునామీని సృష్టించినట్టుగా తెలంగాణ రానే రాదన్న అనుమానాలను పటాపంచలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఘనుడు కెసిఆర్ అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మహేంద్ర తోటకూరి రచించిన 'ప్రజా యోధుడు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేసీఆర్ అప్పులు చేశారని రాహుల్ గాంధీ నుంచి రేవంత్ రెడ్డి వరకు చేస్తున్న తప్పుడు ప్రచారానికి చెంప దెబ్బ లాంటి సమాధానాన్ని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వాన్ని నడపడం చేతకాక, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక, అప్పుల పేరుతో కెసిఆర్‌ను కాంగ్రెస్ బద్నాం చేస్తున్నదని విమర్శించారు. వ్యవసాయంలో 14వ స్థానంలో ఉన్న తెలంగాణను నంబర్ వన్ స్థానానికి కెసిఆర్ తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్రంలో 25 ఏండ్ల కిందటి పరిస్థితి ఇలా లేదని గుర్తు చేశారు. పదేండ్లపాటు శక్తియుక్తులన్నింటినీ తెలంగాణ నిర్మాణం మీద పెట్టామని తెలిపారు. అయితే తాము చేసిన పోరాటాన్ని, తెలంగాణ గొప్పతనాన్ని చెప్పుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కాళోజీ, జయశంకర్,కెసిఆర్‌తో పాటు మరెందరో తెలంగాణ పోరాట యోధుల జీవిత చరిత్రలను నేటి యువతకు తెలిసేలా పుస్తకాలు, ఆడియో, వీడియో రూపాలను తీసుకురావాలని సూచించారు.

## కాజీపేట రైలు తయారీ యూనిట్ వేగంగా అభివృద్ధి

- స్వాతంత్ర్య దినోత్సవంలో దక్షిణ మధ్య రైల్వే జిఎం శ్రీవాస్తవ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను దక్షిణ మధ్య రైల్వే జనరల మేనేజర్ (జీఎం) సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఎగరవేశారు. ఆర్‌పిఎఫ్ బృందంతో గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జోన్ పనితీరు, అత్యుత్తమ విజయాలను వివరించారు. ఏప్రిల్ నుంచి జులై వరకు రూ.6,960 కోట్ల స్థూల ఆదాయన్ని నమోదు చేశామని చెప్పారు. డబ్లింగ్, ట్రిప్లింగ్ ప్రాజెక్టులైన కాజీపేట-విజయవాడ-గూడూరు-బల్హార్షా, విజయవాడ-గూడూరు ట్రిప్లింగ్ ప్రాజెక్టులను ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తి చేస్తామన్నారు. కాజీపేట రైలు తయారీ యూనిట్ వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తవుతుందన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశముందని అన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాశ్, ఇన్‌స్పెక్టర్ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమాసింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.



ఫామ్‌హౌస్‌లో పార్టీ.. పట్టుబడిన ఆఫ్రికన్లు

## బాకారంలో ఎస్‌ఒటి పోలీసుల దాడులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఫామ్‌హౌస్‌లో విదేశీ మందు వినియోగం.. డిజె సౌండ్, నృత్యాలతో సందడి చేసిన 51 మంది ఆఫ్రికన్ దేశస్తులను ఎస్‌ఒటి పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం బాకారం సమీపంలోని ఎస్‌కెఎం ఫామ్‌హౌస్‌లో జరిగింది. మొయినాబాద్ సిఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆఫ్రికన్ దేశానికి చెందిన పలువురు ఫామ్‌హౌస్‌లో పుట్టిన రోజు వేడుకలు ఏర్పాటు చేశారు. ఫామ్‌హౌస్‌లో చాలా కార్లు ఉండటం, డిజె సౌండ్స్ రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఒటి పోలీసులకు పక్కా సమాచారం రావడంతో శుక్రవారం ఉదయం ఫామ్‌హౌస్‌పై దాడి చేశారు. ఆఫ్రికన్ దేశానికి చెందిన 51 మందిని గుర్తించారు. ఇందులో 37 మంది మహిళలు, 14 మంది పురుషులున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఘటనా స్థలంలో విదేశీ మందు బాటిళ్లతోపాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. వీసాలను పోలీసులు పరిశీలించారు. పార్టీ నిర్వహించుకునేందుకు పర్మిషన్ ఉందా? లేదా ? విదేశీ మద్యం ఎక్కడి నుంచి తెచ్చారనే విషయంపై విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తికి భిన్నంగా మోడీ

- అమెరికా ముందు మోకరిల్లుతున్న కేంద్రం
- కార్పొరేట్ల ప్రయోజనాలే సర్కారు లక్ష్యం
- పంద్రాగస్టు వేడుకల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



జెండా వందనం చేస్తున్న జాన్ వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎందరో వీరుల త్యాగఫలమే దేశానికి స్వాతంత్ర్యమనీ, ఆ పోరాట స్ఫూర్తికి భిన్నంగా మోడీ ప్రభుత్వ విధానాలున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో వెస్లీ మాట్లాడుతూ 200 ఏళ్ల పాటు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్, అల్లూరి లాంటి ఎందరో వీరులు దేశ స్వతంత్ర్యం కోసం ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. గాంధీని హత్య చేసిన సంస్థకు బద్దుడైన నరేంద్రమోడీ ఇప్పుడు ప్రధాని స్థానంలో ఉండి ఎర్రకోటపై జెండాను ఎగరేయటం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. 79 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఆశించిన అభివృద్ధి జరగలేదని తెలిపారు. ముఖ్యంగా మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాద దేశమైన అమెరికాకు మోకరిల్లడం దేశ సార్వభౌమత్వానికీ, స్వతంత్ర్య స్ఫూర్తికి విఘాతమని చెప్పారు. రష్యా నుంచి అయిల్ దిగుమతి చేసుకోవడాన్ని ఆపేయాలనీ, లేదంటే దిగుమతులపై 50శాతం సుంకాలను విధించక తప్పదని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ బెదిరిస్తున్నాడంటే... మోడీ మెతక వైఖరికి ప్రత్యక్ష నిదర్శనమని విమర్శించారు. 140 కోట్ల ప్రజలు కాలర్ ఎగరేసుకునేలా మోడీ ట్రంప్‌నకు ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. పెహల్గాం ఘటన అనంతరం 22 నిముషాల్లో పాకిస్తాన్‌పై దాడి చేసి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామని ఎర్రకోట సాక్షిగా మోడీ చెబుతున్నారు కదా..! మరి ఆ యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ పదేపదే ప్రకటిస్తుంటే మోడీ మౌనంగా ఎందుకు ఉడాల్సి వచ్చిందో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు నిలదీస్తున్నా సమాధానం చెప్పకుండా ప్రధాని పారిపోతున్నాడని ఎద్దేవా చేశారు. అమెరికా వ్యవహరిస్తున్న ఈ తీరుకు ప్రధాని మోడీ జో హుజూర్ అంటూ మోకరిల్లుతున్నాడని విమర్శించారు. ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా రాజ్యాంగంలోని సోషలిజం పదాన్ని తొలగించాలంటూ, బిజెపి పరివారం డిమాండ్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దేశంలో 80 శాతం హిందువులున్నారని, వారందరిని ఓట్లుగా కన్సలిడేట్ చేసుకునేందుకు కావాల్సిన ప్రాతిపదికలను ఆ పార్టీ నేతలు ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాలతో మనుధర్మాన్ని తీసుకొస్తున్నారని తెలిపారు. ఆ ధర్మ సూత్రాల ఆధారంగా కుల, స్త్రీ పురుష అసమానతలను స్థిరపర్చాలనే కుట్ర సాగుతోందన్నారు. ప్రజల మధ్య అనైక్యతను సృష్టించేందుకు మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను అర్థం చేసుకుని స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో దేశ భక్తియుత ఉద్యమాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

వినయకుమార్ మాట్లాడుతూ దేశంలో మోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల ఓటు హక్కు ఉంటుందా? లేదా? అనే మీ మాంస కొనసాగుతోందన్నారు. ఎస్‌ఐఆర్ పేరుతో బీహార్‌లో 65 లక్షల ఓట్లను తొలగించారని గుర్తు చేశారు. స్వతంత్ర సంస్థలైన ఇసి, సిబిఐ, ఈడీ లాంటి సంస్థలు బిజెపి జేబు సంస్థలుగా మారాయని విమర్శించారు. దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలు కొనసాగుతున్నాయన్నారు. పూలే, అంబేద్కర్ ఊహించినదానికంటే ప్రమాదకరంగా పరిస్థితులున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ సభ్యులు జి.బుచ్చిరెడ్డి, బాలోత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎన్.సోమయ్య, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

- మానవీయతతో సేవలందించాలి
- ఉద్యోగులకు సిజిఎం రాధాకృష్ణన్ సూచన



మాట్లాడుతున్న హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.రాధాకృష్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్ లోకల్ హెడ్ ఆఫీస్ కోఠీలో 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.రాధాకృష్ణన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పరిశ్రమలు, సేవలు, విద్య, ఆరోగ్య రంగాల్లో అభివృద్ధికి ఎస్‌బిఐ మూలస్తంభంగా నిలిచిందని రాధాకృష్ణన్ అన్నారు. ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ బ్రాండ్‌లలో ఒకటిగా ఎస్‌బిఐ గుర్తింపును పొందిందని గుర్తు చేశారు. తెలంగాణలో ఎస్‌బిఐ 60 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని జరుపుకుంటుందన్నారు. వ్యాపారంలో ఈ ఏడాది ప్రతి జిల్లాలో 1 శాతం మార్కెట్ వాటాను పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ లక్ష్య సాధనలో సిజిఎం నుంచి అన్ని స్థాయిల్లోని ఉద్యోగులు ఐక్యంగా పని చేయాలని సూచించారు. ఎస్‌బిఐ సమగ్ర బ్యాంకింగ్ భావనను బలోపేతం చేయాలన్నారు. వినియోగదారుల పట్ల మానవీయ బాధ్యతతో మెలగాలని, సేవలందించాలని ఉద్యోగులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ షేన్‌బాగ దేవి, జనరల్ మేనేజర్ (ఎస్‌డబ్ల్యు-1) రవి కుమార్ వర్మ, ఎస్‌డబ్ల్యు 2 జిఎం సతీష్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, ఇతర సీనియర్ అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రావణి హాస్పిటల్స్‌లో 'నా ఆరోగ్య సవాల్' క్యాంపెయిన్

ప్రజాశక్తి - హైదరాబాద్ : నగరంలోని శ్రావణి హాస్పిటల్స్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నా ఆరోగ్య సవాల్' క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ఆగస్టు 15 నుంచి 25 వరకు ఉచిత సిబిపి, బిపి, షుగర్, ఇసిజి పరీక్షలను అందిస్తోన్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే ఇందులో పాల్గొనేందుకు 7,000 అడుగులు నడిచి ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించింది. ఫలితాలను 'డాక్టర్ తార' అనే ఎఐ పరిశీలిస్తుందని పేర్కొంది. మంచి ఫలితాలు వస్తే 'హెల్తీ వారియర్ సర్టిఫికెట్' అందుకుంటారు. అదృష్టవంతులకు లక్కీ డ్రా ద్వారా ఉచిత ఫస్ట్ ఎయిడ్ కిట్లు లభిస్తాయి.

# పాట ప్రజల పక్షాన నిలబడాలి

- తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి ఆనందచారి



సదస్సులో మాట్లాడుతున్న ఆనందచారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రామిక ప్రజల ఓదార్పు నుంచి పుట్టిందే కళ అని తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి ఆనందచారి అన్నారు. పాట ప్రజల పక్షాన నిలబడాలని సూచించారు. తెలంగాణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో శుక్రవారం కవులు, రచయితలు, కళాకారుల స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు- సమ్మేళన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను పాట ఎండగట్టాలన్నారు. ఈ మధ్యకాలంలో ఆ ప్రయత్నం జరగడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. పాట ప్రజాపక్షాన్ని వదిలేసిందని, ఫలితంగా ప్రభుత్వాలు సైతం ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని అన్నారు. 79 ఏండ్ల స్వాతంత్ర్య దేశంలో ఉపాధి దొరక్క.. కన్నీళ్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కరువైందన్నారు. తాము పోరాడి సాధించుకున్న హక్కులను కాపాడుకునేందుకు కూడా కార్మికులు ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ క్రమంలో శ్రామిక ప్రజల జీవన సౌందర్యం నుంచి పుట్టిన పాటను వారి కోసమే ఉపయోగించాలని సూచించారు. ప్రభుత్వాలు మతం, కులం పేరుతో సామాన్య ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, ప్రజల మధ్య విభజనను సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్రోద్యమ పోరాటంలో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణం కోల్పోయిన భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్ వంటి మహానుభావుల పేర్లు నేడు వినబడటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు ప్రధాని నరేంద్ర మోడీ.. స్వాతంత్ర్య పోరాటానికి సంబంధం లేని ఆర్‌ఎస్ఎస్ వాళ్ల పేర్లు వల్లే వేస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న యోధులు, శ్రమజీవులకు విముక్తి కల్పించిన పోరాటాల గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు అందుకు కళాకారులు కళారూపాల ద్వారా వివరించాలని చెప్పారు. ఈ సందర్భంగా కవులు, కళాకారులు, రచయితలు.. గ్రామీణ కళలను ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ రాష్ట్ర నాయకులు సలీమ, రచయిత బండి సత్తన్న, భాస్కర్, ఆలేటి ఆటం, ఆయా ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు పురుషోత్తం, బ్రహ్మయ్య, జానీ, అరుణ్ కుమార్, ఇబ్రహీం, బుగ్గ రాములు, యాదయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి గణేష్, జిల్లా నాయకులు ఎంజే వినోద్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.



## అసెంబ్లీలో జాతీయ జెండా ఆవిష్కరించిన స్పీకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ జాతీయ జెండాను ఎగురువేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి నరసింహాచార్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎండిసిలో స్వాతంత్ర్య వేడుకలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజం ఉత్పత్తిదారు అయిన నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండిసి) హైదరాబాద్‌లోని మసాబ్‌ట్యాంక్‌లో గల తన కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించింది. సంస్థ సిఎండి అమితవ ముఖర్జీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2030 నాటికి 100 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికతో ముందుకు పోతున్నదని పేర్కొన్నారు. సంస్థ వృద్ధికి ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన కోరారు. 'నయా భారత్' థీమ్‌ను ప్రతిబింబిస్తూ ఈ సందర్భంగా ఉద్యోగులు ఆపరేషన్ సిందూర్‌కు నివాళులర్పించాయి, అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తీర్ణులైన వారికి బహుమతులు అందజేశారు.

## పంచుడు బంద్ చేసి.. పెంచుడు షురూ చేసింద్రు

- ప్రజల మీద పన్నుల భారం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలపై పన్నుల భారం ఉండదని చెప్పిన సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం.. పంచుడు బంద్ చేసి.. పెంచుడు షురూ చేసింద్రు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పన్నులు తగ్గిస్తే, రేవంత్‌రెడ్డి పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ పాలనలో ప్రజలపై అప్పుల, పన్నుల భారం తప్పా అభివృద్ధి లేన్నారు. ప్రజలపై పన్నులు వేయడం లేదని శాసనసభలో చెబుతున్నా.. దొడ్డి దారిన పన్నులు మోపుతున్నారని విమర్శించారు. పాలనలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, రోజుకో పన్ను వేస్తూ ప్రజలకు షాక్ ఇస్తోందని అన్నారు. గత నెల, ఈ నెలలో ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో రెండు వేల కోట్ల భారం వేశారన్నారు. గతంలో రూ.100 ఉన్న సర్వీస్ ట్యాక్స్‌ను రూ.200కు పెంచారని, వెహికిల్ సర్వీస్ ట్యాక్స్ రూ.400 నుంచి ఒక పర్సంటేజ్ పెంచారని, రోడ్ ట్యాక్స్‌నూ పెంచారని, త్వరలోనే భూ రిజిస్ట్రేషన్ల ధరలు పెంచనున్నారని తెలిపారు. ఫెనాల్టీల పేరిట గత నెల వెయ్యి కోట్లు, ఈ నెల వెయ్యి కోట్లు మొత్తం రెండు వేల కోట్ల భారం వేశారన్నారు. గతంలో రూ.7100 కోట్ల ట్యాక్స్ వసూలు అయితే.. గతేడాది రూ.6900 కోట్లు మాత్రమే వచ్చిందని, ప్రభుత్వ నిర్వాకం మూలంగా ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ట్రాన్స్‌పోర్ట్‌లో ట్యాక్స్‌లు రద్దు చేసి పేదలకు సాయం చేశామన్నారు. రేవంత్‌రెడ్డి తుగ్లక్ చర్యల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నరన్నారు. ఆర్‌అండ్‌బి, పిఆర్‌లో అన్యూటి మోడల్‌లో రోడ్లు వేయాలని కుట్ర చేస్తున్నారని, దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పండుగకు ముందు వారం, తరువాత వారం ఆర్‌టిసి చార్జీలు డబుల్ చేస్తున్నారని, సామాన్యులు ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారని అన్నారు. మద్యం ధరలు రెండు సార్లు పెంచారని, ప్రతి గ్రామానికీ మద్యం షాపులు తెరిచి మహిళల తాళ్లు తెంపుతారా అని ప్రశ్నించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వల్ల రాష్ట్రంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ తగ్గిందన్నారు. వెంటనే ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాజనర్సు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, కనకరాజు, సాయిరాం, అరవింద్‌రెడ్డి, మహేష్, మోహన్‌లాల్ ఉన్నారు.

## అమరవీరులను అవమానపరిచిన ప్రధాని ప్రసంగం

- మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ ప్రసంగం స్వాతంత్ర్య అమరవీరులను అవమానపరిచిందని మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. రంగారెడ్డి జిల్లాలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం గచ్చిబౌలిలో 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. బాలసుబ్రహ్మణ్యం జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సర్వ మతాలు, విభిన్న భాషల సమూహమని చెప్పారు. స్వాతంత్ర్య సంగ్రహంలో ఎంతో మంది వీరులు నెలకొరిగారని గుర్తు చేశారు. మహాత్మగాంధీ, భగత్‌సింగ్, నెహ్రు వంటి ఎందరో మహనీయుల పోరాట ఫలితంగా దేశానికి స్వేచ్ఛ లభించిందన్నారు. కానీ నేడు కొంత మంది మతాలుగా విభజిస్తున్నారని, ఇలా చేయడం మతాల మధ్య కొట్లాటలు పెట్టడమేనని అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎ.రాంచంద్రయ్య మాట్లాడుతూ.. దేశంలో మత విద్వేషాలు పెంచే విధంగా కొన్ని శక్తులు పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు ఆర్ సాంబశివరావు మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ప్రజాస్వామ్యం, సోషలిజం పదాలను తీసివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వికె బాధ్యులు విజయ్‌కుమార్, లైబ్రరీ ఇన్‌చార్జి అనిల్, రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాజ్ భవన్‌లో ఎట్ హోం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఏర్పాటు చేసిన ఎట్ హెూం కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు, పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. బిజెపికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావుతో పాటు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తదితరులు హాజరయ్యారు. బిఆర్ఎస్‌కు చెందిన నాయకులు ఎట్ హెూంకు హాజరు కాలేదు. అయితే బీఆర్ఎస్ మహిళా నాయకురాలు తుల ఉమ ఎట్ హెూంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి మంత్రులను పేరు పేరునా గవర్నర్‌కు పరిచయం చేశారు. కార్యక్రమంలో రాంచందర్ రావును సిఎం రేవంత్ రెడ్డి పలుకరించారు. అదే రకంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారులకు గవర్నర్‌తో కలిసి ప్రత్యేకంగా అభివాదం చేశారు.

### గవర్నర్‌తో సీఎం భేటీ

ఎట్ హెూం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, అసెంబ్లీ సమావేశాలు, పంచాయతీ ఎన్నికల విషయాలను ప్రస్తావించినట్టు తెలుస్తున్నది. బీసీ బిల్లుల గురించి ఆయన గవర్నర్ దగ్గర ఆరా తీసినట్టు సమాచారం.

## ఢిల్లీలో బిఎస్ఎన్ఎల్ 4జి మొబైల్ సేవలు ప్రారంభం




న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ బిఎస్ఎన్ఎల్ ఢిల్లీలో తన 4జి మొబైల్ సేవలను ప్రారంభించినట్లు ప్రకటించింది. దీంతో దేశ రాజధానిలో సంస్థ సేవలను మెరుగుపరచడంలో ఇది ఒక కీలక మైలురాయి అని పేర్కొంది. బిఎస్ఎన్ఎల్ స్వదేశీ సాంకేతికతను ఉపయోగించి 700 మెగాహెర్జ్, 2100 మెగాహెర్జ్ స్పెక్ట్రం బ్యాండ్‌లలో 4జి నెట్‌వర్క్‌ను విజయవంతంగా విస్తరించినట్లు వెల్లడించింది. ఈ సేవలు పంజాబ్‌లో పైలట్ దశలో 40-45 మెగాబిట్స్ పర్ సెకండ్ వేగాన్ని నమోదు చేశాయి. ఇది అధిక నాణ్యత కనెక్టివిటీని అందించే బిఎస్ఎన్ఎల్ సామర్థ్యానికి నిదర్శనమని ఆ వర్గాలు తెలిపాయి. బిఎస్ఎన్ఎల్ దేశ వ్యాప్తంగా 1.12oo లక్షల 4జి, 5జి టవర్లను ఏర్పాటు చేసే ప్రక్రియలో ఉంది. ఈ విస్తరణతో బిఎస్ఎన్ఎల్ తన సేవలను ఆధునీకరించడం, పోటీలో ముందంజలో ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. "మా స్వదేశీ 4జి సాంకేతికతతో భారత్‌ను స్వయం సమృద్ధ టెలికాం శక్తిగా మార్చే దిశగా మేము అడుగులు వేస్తున్నాము. ఈ సేవలు ప్రతి భారతీయుడికి స్థోమతకు తగిన, నమ్మకమైన కనెక్టివిటీని అందించడానికి రూపొందించబడ్డాయి." అని బిఎస్ఎన్ఎల్ సిఎండి ఎ రాబర్ట్ జె రవి పేర్కొన్నారు. నెట్‌వర్క్ విస్తరణ, 4జి అప్‌గ్రేడ్‌తో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్‌లకు బిఎస్ఎన్ఎల్ పోటీని ఇవ్వాలని నిర్దేశించుకుందని తెలుస్తోంది.

## రస్నా నుంచి 'జంపిన్' పళ్ల రసం విడుదల




హైదరాబాద్ : పానియాల సంస్థ రస్నా ప్రయివేటు లిమిటెడ్ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'జంపిన్' పళ్ల రసాన్ని విడుదల చేసినట్లు తెలిపింది. ఇది 100 శాతం స్వదేశీ రెడీ టు డ్రింక్ అని పేర్కొంది. దీన్ని మామిడి, కమలా, లిచీ, మిక్స్‌డ్ ఫ్రూట్ రుచులలో రూ.10 నుండి రూ.85 వరకు ధరల్లో అందుబాటులోకి తెచ్చామని, పది విటమిన్లు, తక్కువ చక్కెరతో ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తయారు చేశామని రస్నా గ్రూప్ ఛైర్మన్ పీరుజీ ఖంబట్టా తెలిపారు. జంపిన్ స్వదేశీ ఉత్పత్తుల శక్తిని చాటుతూ రైతులు, ఎంఎస్ఎంఇలకు మద్దతు ఇస్తుందన్నారు.

## స్విగ్గీ ప్లాట్‌ఫాం ఫీజు రూ.14కు పెంపు

బెంగళూరు : ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాం స్విగ్గీ మరోమారు తన ప్లాట్‌ఫాం ఫీజును పెంచింది. ఇప్పటి వరకు రూ.12గా ఉండగా.. దీన్ని రూ.14కు చేర్చింది. పండగ సీజన్‌లో ఆర్డర్ల సంఖ్య భారీగా పెరగడంతో డెలివరీ సభ్యులకు ఎక్కువ చెల్లింపులు చేయాల్సి రావడం, ఆపరేటింగ్ ఖర్చులు పెరగడం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. స్విగ్గీ తొలిసారి 2023లో రూ.2 ప్లాట్‌ఫాం ఫీజును అమల్లోకి తెచ్చింది. ఇప్పటి వరకు నాలుగు సార్లు పెంచింది. 2024 జులైలో రూ.6కు చేర్చగా, 2024 అక్టోబర్‌లో రూ.10కి చేర్చింది. ఈ ఏడాది ప్రారంభంలో 12కు చేర్చగా.. తాజాగా రూ.14కు పెంచేసింది.రెండేళ్లలో దాదాపు 600 శాతం పెంచింది. రూ.2 పెంపు పెద్దగా అనిపించకపోయినా.. ఈ సంస్థలో రోజు వారిగా 20 లక్షల ఆర్డర్లను డెలివరీ చేస్తోందని అంచనా. తాజా పెంపునతో భారీ ఆదాయం సమకూరనుంది.

## హోటల్స్ విభాగంలోకి రెడ్‌బస్

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ బస్ టికెటింగ్ వేదిక రెడ్‌బస్ కొత్తగా హోటల్స్ విభాగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. దేశంలోని 2000 పైగా నగరాల్లో రూ.399 నుంచే హోటళ్లలో వసతి సదుపాయాలని అందించనున్నట్లు వెల్లడించింది. హాస్టళ్లు, హోమ్‌స్టేలు, అతిథిగృహాలు, లాడ్జీలలో బడ్జెట్ ధరల్లో ప్రయాణికులకు సౌలభ్యాన్ని కలిస్తోన్నట్లు తెలిపింది. "మేము నమ్మకమైన రవాణా సేవలను అందిస్తూనే.. ఇప్పుడు బడ్జెట్ ధరల్లో వసతి సదుపాయాలను విస్తరిస్తున్నాము. రెడ్‌బస్ హోటల్స్‌తో ప్రయాణికులు సులభంగా వసతిని బుక్ చేసుకోవచ్చు. హోటల్ యజమానులు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు." అని రెడ్‌బస్ సిఇఒ ప్రకాష్ సంగం తెలిపారు.